# చేయూత



కప్పగంతుల మల్లికార్జునరావు

"మీ అగ్రిమెంటును నేను అంగీకరించను" బల్లగుద్ది వాదించే ప్లీడరులా చేతిలో గ్లాసును టేబిల్ కేసి గట్టిగా బాదుతూ అరిచాడు మోహన్‌రావు. గ్లాసు పగిలింది. క్లబ్‌లో టేబిల్స్ అన్నీ క్షణం మావైపు తిరిగేయి.

నాకు సిగ్గువేసింది. మోహన్‌రావు స్వభావం తెల్సీ తొందరపడ్డానేమో!

మా టేబిల్‌కి నేను, మోహన్‌రావు, కృష్ణమూర్తి మాత్రమే వున్నాము. కృష్ణమూర్తి మా వూరికి కొత్తగా బదిలీ అయి వచ్చాడు. ప్రభుత్వోద్యోగి. అలాంటి వాళ్లను పరిచయం చేసుకొని పార్టీ యివ్వటం మోహన్‌రావుకు సర్దా. అలా కృష్ణమూర్తిని నేను అతనికి అరగంట క్రితమే పరిచయంచేసేను. కృష్ణమూర్తికీ నాకు చాలా కాలంగా స్వల్ప పరిచయం వుంది

మోహన్‌రావు పెద్ద ధనవంతుడేం కాదు. కానీ రూపాయిని పైసాలాగా ఖర్చుచేస్తాడు. పేకాటనుంచి సంఘ సంస్కరణ, రాజకీయాలదాకా అన్నిటా తనకి - గొప్ప పరిచయం వున్నట్లు మాట్లాడుతుంటాడు. అందరూ అతడిని గొప్పవాడుగా గుర్తించాలని తాపత్రయం. మిగతా విషయాల సంగతెలావున్నా పేకాటలో, తాగటంలో అతను గొప్పవాడనే నా నమ్మకం. నిజానికి అతని జల్సాలకు కావల్సిన డబ్బంతా పేకాట కాశే అతనికి సరఫరా చేస్తున్నది. వెనుక ఎప్పుడో కథలు రాసేనంటాడు.

డ్రింక్‌తో వో రౌండ్ పూర్తికాగానే, మోహన్‌రావు వుపన్యాస అంశాన్ని మార్చేడు. కుటుంబ వ్యవస్థను గురించి, హ్యూమన్ రిలేషన్‌షిప్స్, అనుబంధాలను గురించి చాలా హీనంగా మాట్లాడసాగేడు. కృష్ణమూర్తి దృష్టిలో తానో ప్రోగ్రెసివ్‌నని, మేధావిననీ అనిపించుకోవాలని అతని ఆరాటం.

"మిస్టర్ మోహన్‌రావ్! డోంట్ బి

టూ సినికల్ అండ్ నెగెటివ్. భారత దేశంలో యింకా అంత దుగస్థ రాలేదు. అందుకే యీమాత్రం ఆరోగ్యంగా వన్నా వుంది. మీ దన్నట్లు కుటుంబ వ్యవస్థ, సంబంధబాంధవ్యాలు చాలా మలినం కాలేదు. ప్రేమ, జాలి కరుణ, మనుష్యుల్లో వున్నాయి." అంటూ నేనేదో మాట్లాడబోవటం మోహన్‌రావు కోపానికి కారణం అయింది.

బాయ్ పగిలిన గ్లాసును తీసేసి, మరో గ్లాసును పెట్టేడు. టేబిల్‌ని శుభ్రం చేసేడు. మళ్లీ మూడు గ్లాసులూ నిండేయి.

"మళ్లీ చెప్తున్నాను కృష్ణమూర్తి గారూ. మనిషిని నడిపించే ప్రాథమిక శక్తి డబ్బు. రెండో శక్తి స్వార్థం. భార్యాభర్తలు తండ్రీకొడుకులు లాంటి బంధాలు, రక్తసంబంధ బంధుత్వాలు యివన్నీ భ్రమలు. మనిషి తనని తాను వంచనచేసుకోటానికి వాడే ముద్దుపదాలు. మనిషి ఆత్మాశ్రయుడు. స్వార్థపరుడు."

కృష్ణమూర్తి యింతవరకు వింటున్నాడు కాని మాట్లాడలేదు.

"నిజమేననుకోండి. కానీ సంఘసేవ, బీదలపట్ల ప్రేమ, సమాజ మార్పుకోసం తపన యివికూడా . "

"అన్నీ వొట్టి బూటకాలు సార్." గ్లాసు ఖాళీచేసి నవ్వుతూ అందుకొన్నాడు మోహన్‌రావు. నిషా తలకెక్కితే అతని నోటివెంట నిజాలే కాని అబద్ధాలు రావు. అర్ధనరీ స్టేజీలో వుంటే తను చెప్పే వుపన్యాసాలకు వ్యతిరేక వుపన్యాసం యిప్పుడు యిస్తుండటమే అందుకు ప్రత్యక్ష్య సాక్ష్యం.

"కుటుంబం ఇండివిడ్యుయల్ రిలేషన్స్ యివే భ్రమలు అయి వున్నప్పుడు .. సామాజిక పరమైన సేవలన్నీ పరమ బూటకాలు కావుటండీ? అవలా వుంచండి. కానీ మన ఫ్రెండ్ యిందాక డిపెండ్ చేసేడు కదా? అంతేత పర్సనల్ రిలేషన్‌షిప్స్ వరకే మన చర్చను పరిమితం చేద్దాం ప్రస్తుతానికి. భార్యాభర్తలు, అత్తాకోడళ్లు .. కుటుంబ బంధాలు అన్నికూడా నాన్సెన్స్ అన్నాను కదూ? అందుకు నిదర్శనంగా వో కథ చెప్తాను. వినండి."

"ఓకే" అన్నాను నేను.

మోహన్‌రావు కథ ఆరంభించాడు.

"విశ్వపతి మేష్టరుగారు పండిత వంశంలో పుట్టేడు అయినా పూర్వీకుల పాండిత్యం ఏమాత్రం అబ్బలేదు. అయితే ఆ కుటుంబ ఆస్తికి ఏకైక వారసుడయ్యాడు.

ఆయనకు వో కూతురు, వో కొడుకు.

కూతురుకు పెళ్లయింది. మంచి సంబంధమే చేశారని చెప్పుకొన్నారు జనం.

'కొడుకును ప్రయోజకుడిని చేయాలని తాపత్రయం. ఆ కొడుకు శక్తిసామర్థ్యాలు పరిమితమైనవి. కానీ విశ్వపతి గారి భార్య కొడుకును హెచ్చుగా

అంచనా వేసుకొంది. తన అంచనా మేరకు అతనిచుట్టూ వూహాల భవనాలు అల్లుకొంది.

'భార్య వూహల్ని ప్రచారంచేసే సాధనం విశ్వపతి. అటు స్కూల్లో విద్యార్థులదగ్గర, యిటు యింట్లో భార్య దగ్గర అయనకంటూ వో వ్యక్తిత్వం లేదు. అంచేత ఆ యింటి వ్యవహారా లన్నీ అయన భార్యచేతిమీదుగానే, అయనిపేరిట జరిగేవి. ఆయన భార్య పేరు జయమ్మ.

"మా వాడు ఇంజనీరు అవుతాడు. ఇంజనీరింగ్‌లో సీట్ వచ్చింది"

"ఎక్కడ? ఏ కాలేజిలో?"

"ఏమో! మా అవిడ నడిగి రేపు చెప్తాను."

జయమ్మకు కొడుకంటే అమిత ప్రేమ. అతను ఇంజనీర్ కావాలని ఆమె అతను పుట్టగానే అనుకొంది తల్లికోరిక తీర్చే సామర్థ్యం కొడుక్కి లేదు. ఎక్కడా సీటు రాలేదు. ఎవరో అక్కడెక్కడో సీట్లు అమ్మే కాలేజీ వుందని చెప్పేరు.

"అమ్మా నేను నీ కోరిక తీరుస్తాను. నాకు డబ్బు యివ్వు."

జయమ్మ డబ్బుదగ్గర అమిత ఘట్టి. అయినా కొడుకు ఇంజనీర్ అవుతే ఖర్చయిన డబ్బుకు నాలుగింతలు కట్నం రూపంలో గుంజవచ్చుగా?

ఆరేళ్ల యింజనీరింగ్ చదివి డిగ్రీతో తిరిగిరాలేదు కొడుకు కొత్త అలవాట్లు నేర్చుకొని వచ్చాడు.

"వాడికి మనం పెళ్ళి చేయాలి."

జయమ్మ మాటను పట్టుకొని వూరంతా కొడుక్కి పెళ్ళిచేస్తామని చాటింపు వేసివచ్చాడు.

"మరి చదువు అయిందా? వుద్యోగం రానిదే పెళ్ళేమిటయ్యా?"


"ఇంజనీర్‌కు వుద్యోగం ఎందుకు రాదండీ? పరీక్షలు యింకా కాలేదు. కాగానే బోలెడు వుద్యోగాలు. అసలు యిప్పుడే చాలామంది అడిగేరుట. కానీ మావాడు ముందు చదువుకు ప్రాధాన్యత నిచ్చాడు."

బోలెడంత కట్నం చెల్లించి ఇందిర ఆ యింటి కోడలయింది.

ఇందిర ఇంటర్ పాసయింది. టైప్ షార్ట్ హేండ్‌లలో సర్టిఫికెట్లున్నాయి. హిందీలో నా జట్టు వెంట్రుకలన్నీ పరీక్షలు పాసయింది. పెద్ద పండితురాలు

పెళ్లయిన తర్వాత ఆరునెలల్లో నాలుగు నెలలు నోములని, పండుగలని పుట్టింట్లోనే గడిపింది. ఆరో నెలలో ఆమె భర్త ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. అతను చదివిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అందుకు వుపయోగించింది పాపం!

అతని ఆత్మహత్యకు కారణాలు అనేకం అని భర్త చనిపోయాక తెల్సింది




జన్మస్థలం కాలంలో
ఊరి పేరు వ్రాయాలి గాని
శాంతి నర్సింగ్ హోమని వ్రాయ
కూడదు పాపా!!

ఉండదు. ఇంజనీరింగ్ కాలేజీవాళ్లు అతని పేరు తీసేసేరు. అతనికి ఎప్పటికీ డిగ్రీ వొచ్చే యోగ్యత లేదు. అక్కడ ఎవరో అమ్మాయితో వ్యవహారం నడిపేరు. ఆ అమ్మాయి పెళ్లిచేసుకోమని బెదిరిస్తూ ఉత్తరాలు రాసింది. అతనికి పెళ్లయిందని తెల్సేక ఆ ప్రేయసి "మన విషయం బట్టబయలు చేస్తాను. నిన్ను చంపి నేను చచ్చిపోతాను" అని రాసింది. యింకా యిలాంటి కారణాలు ఎన్నో! అన్నీ అతని స్వయంకృతాపరాధాలే.

అయినా శిక్ష పడింది- తనకు. ఇందిర తను మోసగింపబడ్డట్లు బాధపడింది. తను ఏ సుఖం ఎరుగదు. పైగా విధవ అన్నమాట! తల్లిదండ్రులను తనపెళ్లికి గాను బోలెడంత వదిలింది.

కర్మ లయ్యాయి. ఇందిర బొట్టుపెట్టు కొనే అర్హతను కోల్పోయింది. కర్మ కొచ్చిన తల్లిదండ్రులు ఆమెను తమతో తీసికెళ్తామన్నారు.

"అయ్యో. అంతకన్నానా అన్నయ్య గారూ. వాడి కర్మంటె అలా కాలింది కానీ నా కోడలు బంగారుబొమ్మ. ఇరవై ఏళ్లకే ఆ పిల్ల జీవితం నాశనంకావటం మేము మాత్రం భరించగలమా? నిక్షేపంగా తీసికెళ్లండి" జయమ్మ ప్రేమంతా వొలకబోస్తూ అంది. అంతటితో వూరుకొందా? "మీ రేమనుకోనంటే నేనో విషయం చెప్పాలనుకుంటున్నాను వదిన గారూ. కాలం మారుతోంది. మనం ఛాందస్తపు భావాలు, ఆచారాలు పట్టుకు కూర్చుంటే కుదరదు. ఇందిర నా కోడలు. అయినా చెప్తున్నానంటే ఆపిల్లంటే ఎంత ప్రేమో గ్రహించండి ఇందిరకు మళ్లీ

సంబంధాలు చూడండి. నా చేతులమీదుగా నేను జరిపిస్తాను పెళ్ళి."

ఇందిర తల్లిదండ్రులు మొహ మొహాలు చూచుకొన్నారు ఆరు నెలల క్రితం పెళ్ళినాడు ఆ లాంఛనాలు యీ లాంఛనాలు అని సాధించిన జయమ్మేనా యీమె?

అందరి దృష్టి ఇందిరవైపు మళ్ళింది ఇందిర భర్త పోయినపుడు ఏడ్చి గోల చేయలేదు. 'షాక్'వల్ల ఏడుపు రాలేదని చెప్పుకొన్నారు. కానీ అత్తగారి మాట లకు యిప్పుడు ఏడుపు వచ్చినట్లుంది. కంటివెంట నీరు కారుతుండగా అత్తగారి వద్దకెళ్ళి ఆమె రెండు చేతుల్నీ పట్టుకొని భోరుమని ఏడ్చింది.

"అత్తయ్యా తల్లయినా తండ్రయినా, అత్తయ్యయినా ఆడబిడ్డయినా అన్నీ మీరేనని ఆశలు పెట్టుకొన్నాను. నాకు అత్తిల్లు పుట్టిల్లు మీ సన్నిధే యీ యిల్లే. మీ సేవ చేస్తూ యిక్కడే వుంటాను అత్తయ్యా నాకు పెళ్ళి వద్దు. భర్త వద్దు యీ యిల్లే నా సర్వస్వం" అంటూ ఆమె రెండుకాళ్ళను చుట్టేసింది ఇందిర.

* * *

కథ చెప్పటం ఆపేడు మోహన్ రావు. బాటిల్ ఖాళీ అయింది

"అంతా నేనే తాగేసినట్లున్నాను. మీరేం తాగలేదు. షల్ ఐ ఆర్డర్ వన్ మోర్ బాటిల్?"

"నో నో థేంక్యూ" అంటూ ఫుల్ గ్లాస్‌ను ఎత్తి చూపిస్తూ వారించాడు కృష్ణమూర్తి. "కథ కంటిన్యూ చేయండి."

"నాకు తెలుసు మీరలా అడుగుతారని" మోహన్‌రావు మొహంలో వెలుగు. "ఎందుకంటే- కథలో అత్తా కోడళ్ళ మధ్య ప్రేమ అసహజం. అంత అసహజమైన పాత్రలున్న ఏ కథైనా పాఠకుడిలో, శ్రోతల్లో ఉత్సుకతను రేకిస్తుంది. యాం ఐ కరెక్ట్?" అంటూ సిగరెట్టు వెలిగించాడు మోహన్ రావు.

"తమ అభినయం కృత్రిమమని అత్తాకోడళ్ళిద్దరికీ తెలుసు. కానీ నాలుగు నెలల కాలం ఆ అభినయం సాగింది. ఆ అత్తాకోడళ్ళ అనుబంధాన్ని గురించి వూరంతా కథలుగా చెప్పుకోసాగేరు.

తన మంచితనాన్ని పొగడినప్పుడు ఆనందించేది జయమ్మ కానీ కోడల్ని పొగిడితే వొళ్ళంతా కారం రాసుకొన్నట్లుగా వుండేది. కోడలు తన కోటలో పాగావేసి శక్తిని పుంజుకొన్నట్లు గ్రహించింది సామం పనికిరాదు. అంచేత దండం వుపయోగించింది. మాటల్లో విషం కక్కసాగింది.

"వన్ మినిట్ జయమ్మ అభినయం ఎందుకంటారు? సామాజిక ఆచారాన్ని వుల్లంఘించి కోడల్ని రెండో పెళ్లి చేసుకోమని ఎందుకు అందంటారు?" సమాధానం నాకు తెలుసు. అయినా

మోహన్‌రావుతోనే చెప్పించాలని అడిగేను.

"కృష్ణమూర్తిగారూ మీరూ అతడి ప్రశ్నకు సమాధానం వూహించలేరా?"

కృష్ణమూర్తి నవ్వి "మీరే చెప్పండి" అన్నట్లు తల ఆడించాడు.

"అన్సర్ కథలోనే వుంది జయమ్మకు వొక కూతురు, కొడుకు అని చెప్పేను కదా? కొడుకు పోయాక ఆస్తంతా కూతురుకే దక్కేలా చెయ్యాలని జయమ్మ ఆలోచన. ఆ ఆలోచనకు బీజం వేసినవాడు, నాటకాన్ని ఆరంభింప చేసినవాడూ ఆమె అల్లుడు అని నా అనుమానం. ఎందుకంటే ఆ అల్లుడుగారు, కూతురు, పిల్లలు, ఇందిరను యింట్లో నుంచి పంపేదాకా అక్కడినుంచి కదల్లేదు. మరి - భర్త తర్వాత ఇందిర ఆ ఆస్తికి సహజంగా వారసురాలు. ఆ వారసత్వపు హక్కు పోవటానికి వొక్కటే మార్గం. ఇందిర మళ్ళీ పెళ్ళి చేసుకొంటే ఆ హక్కు పోతుంది. అందుకే కోడల్ని రెండో పెళ్ళి చేసుకోమని అత్తగారు స్వయంగా కోరింది."

"మరి ఇందిర అభినయం ?"

"తాళి కట్టించుకొన్న మరుక్షణంలోనే భర్త వొట్టి అసమర్థుడని తెల్సుకొంది యిందిర. అత్తగారిని, మామగారిని స్టడీ చేసింది. భర్తను లొంగదీసుకొని అత్తామామల పైన అధిపత్యం సంపాదించి ఆస్తిని చేజిక్కించుకోవాలనుకొంది. భర్త చనిపోవటంతో ఆ ప్రణాళిక తల్లక్రిందులయింది. అత్తగారు రెండో పెళ్ళి చేసుకోమనేటంత తెలివిగల దనకోలేదు. ఆ మాట అనగానే ఎత్తుకు పైఎత్తు వేసింది. పుట్టింటికి వెళ్తే తన స్థానబలం పోతుందని అత్తగారిపైన ప్రేమ నటించింది ఆ యింట్లో వూళ్ళో స్థానాన్ని శక్తివంతం చేసుకొంది.

"ఇంతకూ ఆ తర్వాత కథ ఏం జరిగింది?" ప్రశ్నించింది నేనే.

"ఏముంది? జయమ్మ విషం కక్కితే, ఇందిర బాణాలు వేయసాగింది. తన బలం పెంచుకోటానికి తన తండ్రిని, తమ్ముడిని యింట్లోకి తెచ్చిపెట్టింది. రోజుకో యుద్ధం. మహాయుద్ధంగా మారేక మధ్యవర్తులు కలదూర్చేరు. బేరసారాలయ్యాయి. ఆస్తిలో దాదాపు సగం తీసుకొని ఆ కుటుంబంతో సంబంధాన్ని వదులుకొన్నట్లు రాసిచ్చింది."

"ఇదంతా మీకెలా తెల్సు? ఇందిర ఏం చేస్తున్నదిప్పుడు?"

"ఏం చేస్తుంది? అందరూ ఆడవాళ్ళు చేసేపనే; మళ్ళీ పెళ్ళిచేసుకొని యిద్దరు పిల్లలకు తల్లి అయింది. అంతేకాదు. భర్త సంస్కరణాభిలాషి, వుదార మనస్కుడు కావటంచేత వుద్యోగం చెయ్యటానికూడా అనుమతించాడు."

"బాగుంది. కానీ యింత వివరంగా మీకెలా తెల్సింది?"

"ఇందిరను- విధవ అయిన ఇందిరను పెళ్లి చేసుకొన్నది నేనే." మోహన్ రావు గర్వంగా అంటూ లేచాడు.

* * *

ఆ రోజు ఆదివారం-

నేను క్లబ్బుకు వెళ్లలేదు. ప్లాట్ ఆలోచిస్తూ యింట్లోనే వున్నాను. హఠాత్తుగా కృష్ణమూర్తి మా యింటిముందు స్కూటర్ దిగేడు.


"నాతో మోహన్‌రావుగారి యింటికి మీరూ రావాలి. అతని భార్యను చూడాలి నేను."

నాకు మోహన్‌రావు భార్యతో పరిచయం లేదు. అతను రెండో పెళ్లి అమ్మాయిని చేసుకొన్నాడని మాత్రం తెలుసు. ఆమె వెనుక అంత కథ ఉందని అతను మొన్న చెప్పిందాకా తెలియదు. ఆమె వుద్యోగం చేస్తున్న విషయం కూడా ఎన్నడూ చెప్పలేదు.

మేం వెళ్లేసరికి మోహన్‌రావు ఇంట్లో లేడు. ఎన్నో పిలుపుల తర్వాత తలుపు తెరుచుకొంది. ఎదురుగా విషాదం మూర్తీభవించినట్లున్న ఓ స్త్రీమూర్తి నిలబడి వుంది. ఆమె అంతవరకు ఏడ్చి మొహం కడుక్కొని వచ్చినట్లు వుంది.

"ఆయన లేరండీ. రాత్రి పొద్దుపోయాక కాని రారు" అని చెప్పింది తలవంచుకొని. కృష్ణమూర్తిగారు అప్పటికీ కదలలేదు.

"నేను వచ్చింది నీతో మాట్లాడటానికమ్మా."



ఇందిరతోపాటు నేనూ ఆశ్చర్యపోయాను. ఇందిర మమ్మల్ని లోపలికి ఆహ్వానించింది. కృష్ణమూర్తిగారు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా తన ప్రస్తుత కథ చెప్పింది.

మోహన్‌రావు ఆమెను శారీరకంగానే కాక మానసికంగానూ హింసిస్తుంటాడు. ఆమె అత్తగారింట్లో ఆ స్త్రీకోసం ఆడిన నాటకాన్ని హేళనచేస్తుంటాడు. ఆమె మొదటి భర్తతో గడిపిన మధురక్షణాలను గురించి అడగకూడని ప్రశ్నల్ని అడిగి వేధిస్తుంటాడు. ఉద్యోగంలో చేరిందాకా చంపేడు. చేరిం తర్వాత 'ఆఫీసులో ఎవరితో ఏం నాటకాలు ఆడుతున్నావో?' అని మనస్సు తూట్లుపడే మాటలం టుంటాడు. కొద్ది సత్యానికి బోలెడంత వూహల్ని జోడించి, అబద్ధపు వూహా కథల్ని అల్లుతాడు కాని సత్యం ఎంత చెప్పినా విన్పించుకోడు.

'ఎంగ్ విడోవని జాలిపడి నిన్ను చేసుకొన్నాను కానీ, నీ వెనుక యింత కథ వుందని తెలిస్తే చేసుకోపోదును. అసలు నీ మొదటి భర్తకు నువ్వే విషం పెట్టి చంపేవేమోనని నా అనుమానం. కొంపతీసి యిన్ని మాటలంటున్నానని నన్నూ టపాకట్టించెయ్యవు కదూ?' అని అంటూ సంతోషిస్తుంటాడు.

"అన్ని విధాలా నా మొహాన భగవం తుడు బాధలే రాసిపెట్టేడు అన్నయ్యా గారూ. నా మంచితనం ఎందుకూ, ఎక్కడా పనికిరాకుండా పోతుంది. నా దురదృష్టం."

ఆమె ఏడుస్తుంటే నా గుండె ద్రవిం చింది. మోహన్‌రావు మీద అసహ్యం మేసింది. అతనిది వంకరబుద్ధి అని నాకు తెల్సు. కానీ యింత నీచుడా?

హఠాత్తుగా మోహన్‌రావు ప్రవే శించటంతో భయంతో గజగజలాడే లేడిపిల్లలా ఇందిర లోపలికి పరు గెత్తింది.

"నాకు తెలియకుండా నా యింటి కొచ్చి నా భార్యతో మాట్లాడటం పెద్దమనుష్యుల లక్షణం కాదండీ కృష్ణ మూర్తిగారూ. కథ విన్నాక మీకు నా భార్యను చూడాలని అంతగా కోరిక గలిగితే నాకు చెప్పకపోయారా? నేనే తీసికొచ్చి పరిచయం చేసేవాడినిగా?"

"అదే అనుకొన్నాను మిస్టర్ మోహన్‌రావ్! కానీ అప్పుడు నీ కథ కూడా నువ్వు చెప్పిన ఇందిర కథలాగే మారిపోయి వక్రంగా చెప్పబడ్తుందని భయమేసింది. అందుకే నేచురల్ సెట్టిం గులో కథ తెల్సుకొందామని వచ్చాను. తెల్సుకొన్నాను. కానీ నిన్న నువ్వు చెప్పిన కథలో చాలా తప్పులున్నాయ్. ఇందిర మీ రన్నట్లు అత్తగారి పట్ల ప్రేమను అభినయించలేదు. అత్తా మామల్ని ఆ స్థితిలో ఆదుకోవటం తన ధర్మంగా భావించి పుట్టింటికి పోవటానికి నిరాకరించింది. ఆస్తి ప్రసక్తి ఇందిర ఏనాడూ తీసుకురాలేదు. ఆమె తండ్రి తెచ్చేడు. ఆస్తి వద్దని ఆమె అంది. ఆ యింటి విషయం మీ రన్నట్లు రచ్చ కెక్కలేదు. మధ్యవర్తులు రాలేదు. జయమ్మ అల్లుడే మధ్యవర్తిగా వుండి ఆమెకు రావల్సిన సగభాగం ఆస్తిని

ఆమె వద్దంటున్నా ఆమెకు యిప్పించాడు. జయమ్మ కూతురికి ఆస్తిని కట్టబెడదామనుకొన్నమాట వాస్తవమే. కానీ ఇందిరపట్ల కోడలన్న అభిమానం లేకపోలేదు. నిజానికి ఆమె చనిపోయే ముందు యిందిరకోసం కలవరించింది పెళ్ళయిపోయిన ఆమెను పిల్చుకుపోవటం బాగుండదు కదా? మీ రన్నట్లు ఇందిర తెలివిగలదే. కానీ ఆస్తుల విషయంలో– విశ్వపతి కుటుంబ బంధాల విషయంలో కాదు. రెండో పెళ్ళి చేసుకొనే విషయంలో. రెండో పెళ్ళి చేసుకొంటే భర్తవల్ల వచ్చే యిబ్బందుల్ని ఆమె ముందే వూహించింది. ఆ భర్త తన భార్య మరొక పురుషుడికి భార్య అని మర్చిపోలేడని ఆ జ్ఞాపకాలను తనకు బలవంతంగా గుర్తుచేస్తాడని ఆమె ముందుగానే వూహించింది ఆమె వూహ నిజమైపోవటం ఆమె జీవితంలో అసలు ట్రాజెడీ."

మోహన్‌రావు మాట్లాడలేదు. సిగరెట్టు తగలేస్తూ అటూ యిటూ అసహనంగా తిరుగుతున్నాడు.

"నువ్వు గొప్ప కథకుడివి కావచ్చు మోహన్‌రావ్. కానీ మరొకరి కథని చెప్పేటప్పుడు– అందులోనూ, అదీ వో స్త్రీ జీవితాన్ని గురించి అయినప్పుడు, వుత్కంఠరకోసం పైశాచ్యాన్ని జోడించటం పొరపాటు. నీ గొప్పతనాన్ని ప్రదర్శించుకోవటంకోసం మరొకరి మీద బురదచల్లటం ధర్మం కాదు మోహన్‌రావ్. డబ్బు, స్వార్థం మనిషిని నడిపించే ప్రాథమిక శక్తులు కావచ్చు. కానీ వాటి ప్రభావం మనిషిమీద తక్కువగా వుండాలంటే కుటుంబ బంధాలు, హ్యూమన్ రిలేషన్‌షిప్స్‌కు, నైతిక విలువలకి ప్రాధాన్యత నిచ్చే కథలకు ప్రచారం రావాలి. నువ్వు నిన్న చెప్పిన కథలో నిజానికి అవి పుష్కలంగా వున్నాయి. కానీ నువ్వు వాటిని చూడవు, వినవు. పెసిమిస్టులా వూహించి నెగటివ్ యాస్పెక్ట్స్‌తో కథ అల్లి ట్విస్ట్‌లతో చెప్పేవ్. ఆ కథ వినేటప్పుడు బాగుండొచ్చు. కానీ అబద్ధాల పుట్టలు పాముల పుట్టకన్నా ప్రమాదకరమైనవి మోహన్‌రావ్. గుర్తించు. మంచితనం లోకంలో చచ్చిందనుకోకు."

"ఆపండి." మోహన్‌రావు సహనాన్ని కోల్పోయి గట్టిగా అరిచాడు.

"చాలా అవమానకరంగా మాట్లాడుతున్నారు. నా యింటికొచ్చి నా భార్యతో మాట్లాండి కాకుండా నాకు నీతులు చెప్తున్నారా? నాకు నీతులు చెప్పే ముందు యిది చెప్పండి. మీకూ ఇందిరకు ఏమిటి సంబంధం? ఆ కథకూ మీకు ఏమిటి సంబంధం?"

"ఏమిటంటే.. ఇందిర నా చెల్లెలు... వద్దు వద్దు ఆవేశపడకండి"

కృష్ణమూర్తి నవ్వుతూ మోహన్‌రావు ఆవేశాన్ని చల్లబర్చేడు.

"ఇందిర నా కెలా చెల్లెలంటే– నేను విశ్వపతిగారి అల్లుడిని. విశ్వపతిగారెవరో గుర్తులేదా? జయమ్మగారి మొగుడు."

మోహన్‌రావుతోపాటు నేనూ అవాక్కయిపోయాను!